ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 13 జనవరి 2024





వసూళ్లలో.. వెనుకంజి

- పురాల్లో పన్నులు 38.73 శాతమే
- పేరుకుపోతున్న ఆస్తి, నీటి పన్నులు
- రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు
- అధికారుల నిర్లక్ష్యంతో వసూలుకాని బకాయిలు
- వసూళ్లలో రాష్ట్రంలో వినుకొండ ప్రథమ, అద్దంకి ద్వితీయ స్థానం

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తంమీద పన్నుల వసూళ్ల శాతం 38.73 శాతమని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఇక ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వాటి వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండటంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పన్నుల వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఆస్తి, నీటి, ఇతర పన్నులు రూ.449.49 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ.174.11 కోట్లు మాత్రమే వసూలు చేశారు. వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ, అద్దంకి మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచాయి.

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలలోని మున్సిపాలిటీ లలో ఆస్తి పన్ను రూ.368.87 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.157.71 కోట్లు వసూ లైనట్లు డీఎంఏ కార్యాలయ లెక్కలు తెలియజేస్తున్నాయి. పన్ను వసూలు శాతం 42.75గా నమోదైంది. నీటి పన్ను వసూలు కూడా నామ మాత్రంగా ఉంది. తాగునీటి పన్ను రూ.80.62 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.16.40 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. నీటి పన్ను వసూలు 20.34 శాతంగా ఉంది. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపాలిటీలలో అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగు తున్నది. పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా వారి మొర మున్సిపాలిటీ అధికారులు ఆలకించే పరిస్థితి లేదు. మార్చి ఆఖరు కల్లా సుమారు రూ.211.16 కోట్లు ఆస్తి, తాగునీటి పన్ను రూ.64.22 వసూలు చేయాల్సి ఉంది.



గుంటూరు కార్పొరేషన్‌లో దాదాపు రూ.20.36 కోట్లు ప్రభుత్వ సంస్థల భవనాలు, కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకు పోయాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.3.47 కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అన్ని పురపాలక సంఘాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.

జీతాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

నిధుల లేమితో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుందనేది బహిరంగ రహస్యం. అయినా అటు అధికారులు ఇటు పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలను గాలికివదిలేసిందని అందువల్లే ప్రధాన ఆదాయవనరైన పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉన్నట్లు అర్థమవుతుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిలిపి వేస్తున్నారు.

పన్నుల వసూళ్లలో అక్రమాలు..

ఆస్తి, తాగునీటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు ఇతర పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మున్సిపాల్టీల్లో ప్రధానంగా ప్రకటనల పన్ను పక్కదారి పడుతోంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, వాటి పన్నుల వసూళ్లకు పొంతన ఉండటంలేదు. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన పన్నుల వసూలులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు పన్నుల ఆదాయాన్ని పెంచుకోవడంలో అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్నులకు సంబంధించి ఏటా ఒక్కో మున్సిపాలిటీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నది. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేక పోవడం వల్లే ఈ ఆదాయాన్ని మున్సిపాలిటీలు రాబట్టుకోలేకపోతున్నాయి.

మున్సిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూళ్లు ఇలా...

మున్సిపాలిటీ	వసూళ్ల లక్ష్యం రూ.కోట్లలో	వసూలు రూ.కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా			
నరసరావుపేట	14.83	6.99	47.10
చిలకలూరిపేట	14.14	3.84	27.20
వినుకొండ	4.26	3.75	88.20
సత్తెనపల్లి	6.40	2.92	45.70
మాచర్ల	4.90	2.37	48.50
పిడుగురాళ్ల	4.74	2.66	56.10
దాచేపల్లి	1.78	1.17	65.90
గురజాల	1.29	0.59	46.00
బాపట్ల జిల్లా			
రేపల్లె	4.76	2.83	59.40
బాపట	8.14	3.97	48.80
అద్దంకి	3.78	3.05	80.90
చీరాల	10.30	6.73	65.40
గుంటూరు జిల్లా			
గుంటూరు కార్పొరేషన్	231.64	80.03	34.50
పొన్నూరు	5.07	2.95	58.20
మంగళగిరి, తాడేపల్లి	30.62	19.30	62.89
తెనాలి	22.22	11.59	52.10

ప్రమాదకరంగా.. భూహక్కు చట్టం

- రద్దు చేసే వరకు పోరాటం చేయాలని నేతల పిలుపు
- రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదుల నిరసన



భూహక్కు చట్టానికి వ్యతిరేకంగా జాషువా విగ్రహం వద్ద మానవహారం



నగరంపాలెం కూడలిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూమి హక్కు యాజమాన్య చట్టం అత్యంత ప్రమాదకరమైనదని ప్రతిపక్ష పార్టీల నాయకులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తెలిపారు. ఈ చట్టంతో వచ్చే ప్రమాదకర పరిణామాలను గుర్తించి పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భూహక్కు చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు నిరసన తెలిపారు. తొలుత జిల్లా కోర్టు నుంచి నగరం పాలెం వరకు ర్యాలీ, అనంతరం మానవహారం చేపట్టారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులకు వైసీపీ ప్రభుత్వం విఘాతం కల్పిస్తోందని, రాజ్యాంగానికి లోబడి రాష్ట్ర పాలన జరగడం లేదని పలువురు తెలిపారు. భూహక్కు చట్టం ద్వారా న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ఈ చట్టం వల్ల అధికార, అంగ, అర్థబలం, ఉన్నవాళ్లు భూ ఆక్రమణలకు పాల్పడడమే గాకుండా రెవెన్యూ అధికారులను అనుకూలంగా మార్చుకుని ఆ భూములను సొంతం చేసుకునే ప్రమాదం ఉందన్నారు. చట్టం అమలు నిలుపుదల చేయకుండా వెనక్కు తీసుకోబోమని ప్రకటించడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని మండిపడ్డారు. నిరసనల్లో టీడీపీ నాయకులు నసీర్ అహమద్, బూర్ల రామంజనేయులు, డేగల ప్రభాకర్, నిమ్మల శేషయ్య, దామచర్ల శ్రీనివాస్, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, నేరళ్ల సురేష్, సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్, న్యాయవాదులు కొల్లి శ్రీనివాసరావు, పాలడుగు వెంకటేశ్వరరావు, లావు అంకమ్మచౌదరి, చిగురుపాటి రవీంద్రబాబు, చుక్కపల్లి రమేష్, సోమిసాని బ్రహ్మానందరెడ్డి, రాజారావు, సుధీర్, వంశీ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బరులు.. సిద్ధం

- గ్రామాల్లో పందాలకు సై
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఏర్పాట్లు
- కత్తులు దూసేందుకు సిద్ధమవుతోన్న కోళ్లు
- పోలీసు హెచ్చరికలను ఖాతరు చేయని వైనం



వేమూరు మండలం వరహాపురం వద్ద కోడి పందాల కోసం ఏర్పాటు చేసిన బరి



చుండూరు మండలం వేటపాలెంలో బరి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



రేపల్లె వద్ద ఏర్పాటు చేసిన బరి వద్ద ఉన్న పోలీసులు

కొల్లూరు, అద్దంకి/బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఇంకా సమయం ఉన్నా.. కోడి పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. కత్తులతో కోళ్లు.. పందాలకు జూదరులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి భారీగానే కోడి పందాలు జరిగేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పందాలకు అనుమతి లేదని పోలీసుల హెచ్చరికలు ఖాతరు చేయడంలేదు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో కోడి పందాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ తంతు జరుగుతుంది. వేమూరు మండలం వరహాపురం పరిధిలో కోడి పందాలు వేసేందుకు బరి దాదాపు సిద్ధమైంది. కొల్లూరు మండలం పెసర్లంక సమీపంలో బరిని ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో పెదపులివర్రు, ఓలేరు-పేటేరు మధ్యలోని జాతీయ రహదారి వెంబడి భారీ స్థాయిలో బరికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుండూరు మండలం వేటపాలెంలో కోడి పందాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బరుల సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసినా వారిని పట్టించుకోకుండా ట్రాక్టర్లతో భూమి చదును, బారికేడ్లు తదితర పనుల్లో నిర్వాహకులు ఉన్నారు. వేమూరు పరిధిలో మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున ఆశీస్సులతో ఆ పార్టీ నాయకులు కోడి పందాలకు బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు సర్కిల్ పరిధిలో కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. నిర్వాహకులు కొన్నిప్రదేశాలను ఎంపిక చేసుకుని జూదరులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే బాపట్ల జిల్లా ఎస్పీ జిందాల్ గురువారం డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడా కోడి పందాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా కోడి పందాలు జరిగినట్లు సమాచారం వస్తే ఆ పరిధిలో ఉన్న ఎస్‌ఐలను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.



మంగళగిరిలో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఖిద్మత్ టీం సభ్యులు

హరిదాసు.. ఓ జ్ఞాపకం

- కనుమరుగైపోయిన సనాతన ఆచారం
- వినపడని హరిలో రంగ హరి సంకీర్తన



గుంటూరు సిటీ, జనవరి 12: చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జెలు, పట్టు పంచె ధోవతి, నెత్తిన గుండ్రటి రాగిపాత్ర నోటి నిండా నారాయణుని నామ సంకీర్తనతో పొద్దు పొడవక ముందే తరతమ భేదం లేకుండా ఇంటింటికి వచ్చే వారే హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం కాగానే హరిదాసు ఇంటి ముందుకు వచ్చాడంటే సంక్రాంతి దగ్గర్లో ఉన్నట్లు లెక్క. వాళ్లకి కుల మతాలతో పనిలేదు. ధనికులు దరిద్రులన్న తేడా లేదు. హరినామ స్మరణ చేసే వారిని అనుగ్రహించడానికి హరిదాసు రూపంలో వైకుంఠం నుంచి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే వస్తాడన్నది నమ్మకం. హరిదాసు వట్టిచేతులతో వెళ్లిపోతే ఆ ఇంటికి అరిష్టమని కొంతమంది నమ్మకం. అందుకే ఊరిలోకి హరిదాసుడు వస్తున్నాడంటే ఇంటి యజమానురాలు ధాన్యంతో గుమ్మంలో సిద్ధంగా ఉంటారు. ఒక ముక్క లో చెప్పాలంటే హరిదాసు మన సంస్కృతి లో భాగం. సంక్రాంతి పండుగలో భాగం. చిన్నప్పటి మన జ్ఞాపకం. ఇప్పుడా హరిదాసు కనపడటం లేదు. హరిలో రంగ హరి అంటూ వినిపించే హరినామ సంకీర్తన వినపడటం లేదు. మొత్తంగా హరిదాసు జాడేలేదు. మారిన సమాజ స్థితిగతులు శతాబ్దాల నాటి హరిదాసు వైభవాన్ని మాయం చేశాయి. తాతలు, తండ్రుల తరం వెళ్లిపోయాక వారి పిల్లలు హరిదాసు కట్టు బొట్టు పెట్టేందుకు తటపటాయిస్తున్నారు. కొన్ని చోట్ల తగినంత ఆదరణ లేకపోవడం, మరికొన్ని చోట్ల కొద్దిగా చిన్న చూపు చూస్తూ ఉండటంతో తండ్రి వారసత్వంగా హరిదాసు వృత్తిని కొనసాగించేందుకు వారి పిల్లలు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో హరిదాసు ఓ జ్ఞాపకంగా మారాడు. పాత సినిమాల్లో.. పుస్తకాల్లో.. కథల్లో.. ఓ స్మృతిగా కనిపిస్తున్నాడు.

ఉదయ్‌తో విశాఖకి కనెక్టివిటీ

- జెండా ఊపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభోత్సవం



జెండా ఊపి ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కి సిగ్నల్ ఇస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉదయ్ ఏసీ డబుల్ డెక్కర్ రైలుతో గుంటూరు - విశాఖపట్టణం మధ్య రైలు కనెక్టివిటీ మరింత పెరిగిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. వారంలో ఐదు రోజులు నడిచే ఈ రైలు సమయపట్టిక ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వేకువజామున విశాఖలో బయలుదేరితే మధ్యాహ్నానికి గుంటూరుకు చేరుకోవచ్చని, అలానే గుంటూరులో సాయంత్రం రైలు ఎక్కితే రాత్రికి విశాఖ చేరవచ్చన్నారు. శుక్రవారం సాయంత్రం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు ప్రారంభోత్సవం జరిగింది. రేణిగుంటలో నంద్యాల ప్యాసింజర్, నరసపూర్‌లో అమరావతి ఎక్స్‌ప్రెస్‌లను వీడియో లింకు ద్వారా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి కిషన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరైన రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రయాణికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ బోగీలతో పాటు నాన్ ఏసీ కోచ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలానే కర్ణాటక ప్రాంతానికి కోస్తాంధ్రతో కనెక్టివిటీ పెంచేందుకు హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్‌కు పొడిగించామన్నారు. నంద్యాల ప్రాంత ప్రయాణికులకు తిరుపతి కనెక్టివిటీని పెంచేందుకు నంద్యాల - కడప రైలుని రేణిగుంటకు పొడిగించామని చెప్పారు. ఈ మూడు రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రైల్వేలో ప్రధాని మోదీ నేతృత్వంలో అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టడం అభినందనీయమన్నారు. గుంటూరులో పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు ఆమోదం తెలపాలని కోరారు. అలానే రైల్వేస్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్‌రోడ్లను రైల్వే నిర్మించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, బీజేపీ మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు మృతి

దాచేపల్లి, జనవరి 12: అప్పుల బాధ తాళలేక కౌలురైతు బలవన్మరణం చేసుకున్న సంఘటన శుక్రవారం దాచేపల్లి మండలంలోని కేశానుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కడియం రవి (32) ఇంట్లోని దూలానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి 10 లక్షలకు పైగా అప్పు వుందని, 3 ఎకరాలలో మిర్చి, 5 ఎకరాలలో పత్తి పంటలు సాగుచేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఐదేళ్ల, రెండేళ్ల వయసు కలిగిన పాప, బాబు వున్నారు. దాచేపల్లి ఎస్‌ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశంలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12 : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళ మహారాష్ట్రకు వెళ్లి వచ్చారు. అనంతరం ఇంకొల్లులోని తల్లి ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌లో పరీక్ష చేయించుకున్నారు. శుక్రవారం వచ్చిన ఫలితాల్లో ఆమెకు పాజిటివ్ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె ఇంకొల్లులోని తన తల్లి ఇంట్లో ఐసోలేషన్‌లో ఉండి చికిత్స పొందుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్‌ఎంవో డాక్టర్ బీ తిరుమలరావు తెలిపారు.

కౌలు రైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 12 : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కౌలు రైతుల ఉసురు తీస్తుందని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 75వేల మంది కౌలు రైతులకురుణాలు అందించామని చెప్పటానికి ఆర్థిక మంత్రి బుగ్గనకు కనీసం సిగ్గు ఉందా? ప్రశ్నించారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా, ముఖ్యమంత్రి అయ్యాక కూడా రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ రైతు భరోసా అందిస్తామని ఇచ్చిన హామి ఏమై పోయిందని? ప్రత్తిపాటి నిలదీశారు. చిలకలూరిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డుల విధానం అని, ఇప్పటికి మూడు లక్షల మందిని మాత్రమే గుర్తించటం దారుణం అనుకుంటే వారిలో 75వేల మందికే బ్యాంక్ రుణాలు అందించటం దయనీయం అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలపటానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, తెలుగుదేశం, జనసేన కూటమికి అధికారం తథ్యమని ఉద్ఘాటించారు.

పాఠశాల స్థలం కబ్జాకు వైసీపీ నాయకుడి యత్నం

నిర్మాణానికి ఇసుక, కంకర తరలింపు ● ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం



వైసీపీ నాయకుడు కబ్జాకు యత్నం చేస్తున్న స్థలం వద్ద రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

నిడుముక్కల(తాడికొండ), జనవరి 12: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆట స్థలాన్ని కబ్జా చేయడానికి వైసీపీ నాయకుడు విశ్వప్రయత్నం చేస్తున్నారు. స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి శుక్రవారం ఇసుక, కంకరను తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సెక్రటరి సంఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించరాదని హెచ్చరించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బందిపై ఆ నేత వాగ్వాదానికి దిగారు. అయితే గత ఆదివారం కూడా ఇదేవిధంగా స్థలం ప్రహరి పగలగొట్టి గోతుల తీయడానికి ప్రయ్నతం చేయటంతో రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. పాఠశాలకు చెందిన భూమిలో నిర్మాణాలు చేపట్టడానికి స్థలం ప్రహరీని పగలగొట్టి పునాదులు తీసి నిర్మాణాలు చేపట్టడానికి చిగురుపాటి వీర రాఘవయ్య సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వీఆర్వో సంఘటన స్థలానికి చెరుకుని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు, పనులు చేపట్టరాదని హెచ్చరించారు. హెచ్చరికబోర్డులు పెట్టడానికి ప్రయత్నించిన రెవెన్యూ సిబ్బందితో ఆయన వాగ్వాదానికి దిగి బోర్డులు ఏర్పాటు చేస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటా నని బెదిరించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆయనకు నచ్చజెప్పి బోర్డులు ఏర్పాటు చేయమని, ఏదైన ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలన్నారు. వివరాల్లోకి వెళితే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో ఉన్న పాఠశాలకు జిల్లా పరిషత్ హోదా కోసం స్థానిక టీడీపీ నాయకులు ప్రయత్నించారు. పాఠశాలకు జడ్పీ హోదా రావాలి అంటే సుమారు రెండు ఎకరాలు ఆట స్థలం కావాలని విద్యాశాఖ చెప్పటంతో సర్వే 259లోని సాముదాయ పోరంబోకు లోని సుమారు రెండు ఎకరాల స్థలాన్ని పాఠశాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. దీంతో నిడుముక్కల పాఠశాలకు జడ్పీ పాఠశాల హోదాను విద్యాశాఖ మంజూరు చేసింది. స్థానిక టీడీపీ నాయకులు ఆ స్థలాన్ని బాగు చేయించి ప్రహరీని నిర్మించారు. కాలక్రమేణ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జడ్పీ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకోవాలని వైసీపీ శ్రేణులు ప్రయత్నించారు. కాని టీడీపీ నాయకులు చాలా సార్లు ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా సదరు స్థలం జడ్పీపాఠశాలకు చెందిన భూమి అని హైకోర్టులో పిటీషన్ వేశారు. ప్రసుత్తం ఆ స్థలం కోర్టు పరిధిలో ఉన్నది కాని వైసీపీకి చెందిన వారు స్థలాన్ని ఆక్రమించాలనే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని కేటాయిస్తే దానిని కూడా కబ్జా చేసేందుకు అధికారపార్టీ నాయకులు ఆక్రమణదారులకు అండగా ఉంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులకు పాఠశాల స్థలాన్ని కాపాడాల్సి బాధ్యత ఉన్నదని గ్రామస్తులు తెలిపారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు గొప్ప అవకాశం

●జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు సిటీ, జనవరి 12: ఈ ఏడాది మార్చి నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు గొప్ప అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. శుక్రవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాలెండర్ కార్యకలాపాల్లో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసులను, భాగ పంపిణీ కేసులను పరిష్కరించుకోవటానికి జాతీయ లోక్ అదాలత్ చక్కని వేదిక అని అన్నారు. సంవత్సరంలో నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేయటం ద్వారా కక్షిదారులకు కేసులు రాజీ చేసుకోవటానికి ధనము కాలము ఆదా చేసుకోవటానికి మంచి అవకాశమని అన్నారు. పెర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ ఛైర్మన్ రాంబాబు ఈ సమావేశంలో లోక్ అదాలత్ గురించి తెలియ చేసారు.

నేటి బాలలే రేపటి పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులని వాళ్లకు చట్ట సభల గురించి తెలియ చేయటం ముదావహమని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి లీలావతి అన్నారు. అరండల్ పేటలో జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ బాల పంచాయత్ ఇంటర్ఫేస్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ పిల్లలు న్యాయ సేవాధికార చట్టం, బాలల హక్కుల గురించి తెలుసుకోవాలని వారి చుట్టపక్కలవారికి తెలియ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బాల పంచాయతీ సభ్యులకు న్యాయ సేవాధికార చట్టం, బాలల హక్కుల గురించి వివరించారు. ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ ప్రమీల, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ గాయత్రీ దేవి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ్ కుమార్, బచిపన్ బచావో ఆందోలన్ స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, చైల్డ్ రైట్స్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ తదితరులు పాల్గొన్నారు.

పండుగ ప్రయాణం.. కిటకిట

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ● సర్వీసులు లేక గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇక్కట్లు



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు, సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

గుంటూరు, జనవరి 12: సంక్రాంతి పండుగకు సొంతూళ్ళకు వెళ్ళేందుకు ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు క్యూ కడుతున్నారు. పండుగకు నాలుగు రోజులు ముందుగానే ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణీకుల కోసం ఇప్పటికే స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారు. స్పెషల్ బస్సుల్లో సైతం సాధారణ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ ప్రకటించటంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గుంటూరు -1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి అదనపు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సొంతూళ్ళకు వెళ్ళేందుకు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించటంతో విద్యార్థుల కోలాహలం కనిపిస్తోంది. గుంటూరు నుంచి విజయవాడతో పాటు రాయలసీమ, గోదావరి జిల్లాల నుంచి ఇక్కడకు చదువుల కోసం వచ్చిన విద్యార్థులు పండుగకు సొంతూళ్ళకు వెళుతున్నారు. ఇక శనివారం నుంచి ఉద్యోగుల రద్దీ కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రయాణికులకు తప్పని ప్రయాణ కష్టాలు...

పండుగ ప్రయాణ కష్టాలు తప్పటం లేదని పలువురు పోతున్నారు. దూర ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసిన అధికారులు జిల్లాలో తిరిగే బస్సుల సంఖ్య పెంచకపోవటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా గుంటూరు నుంచి బాపట్ల, పల్నాడు ప్రాంతాల వైపునకు వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె వెలుగు సర్వీసులకు కోత పెట్టటంతో పాటు సమయానికి బస్సులు లేకపోవటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఆయా మార్గాల్లో రద్దీకి అనుగుణంగా అధికారులు సర్వీసులు అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల కోసం వేచ్చి ఉన్న ప్రయాణికులు, బోగీ వద్ద ప్రయాణికులు

నేడు విశాఖపట్టణానికి ప్రత్యేక రైలు

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా శనివారం విశాఖపట్టణానికి ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 08591 విశాఖపట్టనం - గుంటూరు రైలు శనివారం ఉదయం 8.20కి బయలుదేరి దువ్వాడ, సామర్లకోట, రాజమండి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదగా మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. నెంబరు. 08592 గుంటూరు - విశాఖపట్టణం రైలు శనివారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా రాత్రి 11.50కి విశాఖపట్టణం చేరుకొంటుంది. ఈ రైలులో ఏసీ టూటైర్ ఎకానమి, స్లీపర్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

23, 24 తేదీల్లో 'ఐపీ యాత్ర'పై వర్క్‌షాప్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) నిర్వాహకులకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్)పై అవగాహన కల్పించేందుకు కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తెలిపింది. ఇండస్ట్రియల్ డిజైన్స్ కాపీరైట్స్, పేటెంట్స్, ట్రేడ్‌మార్క్, ట్రేడ్ సీక్రెట్స్, జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జీఐ) రిజిస్ట్రేషన్స్ తదితర అంశాలపై ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ అధికారులు, ఆయా రంగాల నిపుణు లు సలహాలు, సూచనలు ఇచ్చి అవగాహన కల్పించనున్నట్లు వివరించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఈల మేథోసంపత్తిని ప్రోత్సహించడంతోపాటు దేశ, విదేశాల్లో ఈ-ఫైలింగ్స్ సంఖ్యను పెంచడమే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ 'ఐపీ యాత్ర' పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వర్క్‌షాపులో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తారని ప్రకటించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

మూడు రాజధానుల ఆలోచన నుండి సీఎం బయటకు రావాలి

తుళ్లూరు జనవరి 12: మూడు రాజధానుల మూర్ఖపు ఆలోచన నుండి సీఎం జనగన్ రెడ్డి బయటకు రావాలని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు , మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1487 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులటం నియంత పోకడలకు నిదర్శనమన్నారు. ప్రజా స్వామ్యంలో నియంత నిర్ణయాలు తీసుకుంటే గద్దె దిగాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లైనా అమరావతి రాజధాని కట్టలేకపోయింది. మన అధికారంలోకి రాగానే బ్రహ్మాండంగా కడతాం.. అని సీఎం జగన్‌రెడ్డి చేసిన ప్రసంగాలను గుర్తు తెచ్చుకోవాలన్నారు . అధికారంలోకి రాగానే అమరావతిని భ్రమారావతి అని , ముంపు అని, ఎడారని , అనేక అసత్య ప్రచారాలు చేశారన్నారు. మరి ముంపు ప్రాంతం నుండే రాష్ట్ర పరిపాలన గత ఏడేళ్ల నుండి జరుగుతుంది కదా.. పాలకులు మునగలేదే.. దీనికి సమాధానం ఏం చెపుతారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆట మానుకోవాలన్నారు. ప్రజల అభీష్టం మేరకు , రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ప్రకారం అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

1487 వ రోజుకు రైతుల ఆందోళనలు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

63,634 మిర్చి టిక్కీల అమ్మకం


గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 63,634 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 69,258 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 33,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000	334	9000	19000
నెంబరు. 5	11500	18200	నెంబరు. 5	15000	15000
273	12500	14000	273	–	–
341	10000	18000	341	13500	17800
4884	12000	18500	4884	–	–
సూపర్ 10	--	--	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000	తేజ	9000	15000
బ్యాడిగి	9000	20000	బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	10000	20000	దేవనూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5000	12000

అంబేడ్కర్ విగ్రహ సాధనలో 'గోళ్లమూడి'ని గుర్తించాలి

ప్రభుత్వాన్ని కోరిన వివిధ దళిత సంఘాల నేతలు

విజయవాడ, జనవరి 12: విజయవాడ స్వరాజ్య మైదానంలో ప్రారంభించబోతున్న అంబేడ్కర్ విగ్రహ సాధనకు గోళ్లమూడి రాజసుందరబాబు చేసిన పోరాటాన్ని గుర్తించి, ఆయనను తగిన విధంగా సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు దళిత, గిరిజన, ప్రజా, ఉద్యోగ, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడా రు. 2014 నుంచి 2016 వరకు రాజసుందరబాబు నాయకత్వంలో చేసి న నిరంతర పోరాటం కారణంగానే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ స్థాపనపై 2016 మార్చి 19న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. తర్వాత 2017 ఏప్రిల్ 14న అమరావతిలో టీడీపీ ప్రభుత్వం విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందన్నారు. 2020 అక్టోబరు 9న సీఎం జగన్ స్వరాజ్య మైదానంలో 18 ఎకరాల్లో శంకు స్థాపన చేసి రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి జాతికి అంకితం చేయనున్నారన్నారు. చార్వాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు సాంబయ్య, ఐద్వా సంఘం నేతలు బేతపూడి భారతి, దారా వెంకటరత్నం పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు : డీటీసీ కరీం

గుంటూరు(తూర్పు), జనవరి 12: సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా కాంట్రాక్ట్ క్యారేజ్ నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధికచార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ కరీం హెచ్చరించారు. శుక్రవారం టోల్‌ప్లాజా వద్ద ఆయన బస్సులను తనిఖీలు చేశారు. అనంతరం కరీం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి టోల్ ప్లాజా, పేరేచర్ల జంక్షన్ వద్ద కాంట్రాక్టు బస్సులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి మొత్తం 89 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో బస్సుల్లో సరుకులు చేరవేసినందుకుగాను 23, ప్రయాణికుల వివరాలు పట్టిక నిర్వహించనందుకు 8, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపినందుకు 5, మల్టిటోనడ్ హరన్‌పై 14, మిగతా ఇతర నిబంధనలు పాటించనందుకు 39 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 12: బిల్డింగ్‌కు సున్నం వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందిన ఘటన ఏలూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కె.మరియదాసు(40) కొంతకాలం నుంచి ఏలూరు జిల్లా ఏలూరు తూర్పువీధిలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని పెయింటింగ్ పనులు చేయడానికి శుక్రవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారి కిందపడి తీవ్రగాయాలకు గురికాక వెంటనే ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

టీడీపీపై రాయపాటి రంగారావు ఫైర్

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): టీడీపీపై మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తనయుడు రంగారావు విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పతనానంతరం ఆపార్టీని వీడిన సాంబశివరావు 2014 ఎన్నికల సమయంలో టీడీపీలోచేరి నరసరావుపేట పార్లమెం టరీ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. తిరిగి 2019 ఎన్నికల్లోనూ టీడీపీ తరుపున అదే నియోజకవర్గం నుంచి పోటీచేసి పరాజయం పాలయ్యారు. తదనంతరం ఆయన వృద్ధాప్యం రీత్యా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అప్పటినుంచి రంగారావు కూడా గతంలోలానే వ్యాపారవ్యవహారలకే పరిమిత మైపోయారు. కాంగ్రెస్‌లో రాయపాటి సోదరుల హవా కొనసాగేటప్పుడు రంగారావు రాజకీయాలకు దూరంగావుంటూ వారివారసత్వాన్ని అందిపుచ్చుకో లేకపోయారు. అయితే నాలుగేళ్ళుగా సొంత వ్యవహారాలకే పరిమితమైన రంగారావు హఠాత్తుగా శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ అసలు ఒక రాజకీయ పార్టీయే కాదు అంటూ విమర్శలు చేశారు.

రంగారావుకు మతిభ్రమించింది

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ రాయపాటి సాంబశిరావు కుమారుడు రంగారావుకి మతి భ్రమించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుందామంటే కుదరదని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంతకాలం పైరవీలతో కాలం గడిపి, అధికారం పోగానే అడ్రస్ లేకుండాపోయిన రంగారావు చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు. బాబాయి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కి ఎమ్మెల్సీ పదవిరాకుండా వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఆయనదన్నారు. రాయపాటి రాజకీయ చరిత్రను నిలబెట్టక పోగా అన్నీ విధాల భ్రస్టు పట్టించిన ఘనుడు రంగారావని అన్నారు. చంద్ర బాబు, లోకేశ్‌ల పేరెత్తే కనీస అర్హత ఆయనకు లేదన్నారు. రంగారావు చేసిన దుర్మార్గాలకు అంతే లేదని, కేవలం రాయపాటి సాంబశివరావు మొఖం చూసి అందరూ వదిలేశారని కనపర్తి అన్నారు.



నమో రన్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'నమో రన్'

గుంటూరు, జనవరి 12: స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్క రించుకొని గుంటూరుజిల్లా మహిళామోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో 'నమో రన్' కార్య క్రమవ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్ మాట్లాడుతూ యువతకు స్వామి వికానంద సూక్తులు స్ఫూర్తిదాయకమన్నారు. మన సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు. 'ప్రయత్నం చేసి ఓడిపో.. కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకని' ఆయన చెప్పిన మాటలు జీవితాలను ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్, శనక్కాయల అరుణ, వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఈదర శ్రీనివాసరెడ్డి, మాగంటి సుధాకర యాదవ్, కుమార్ గౌడ్, పాలపాటి రవికుమార్, మహిళా మోర్చా జోనల్ ఇన్‌చార్జి చిగురుపాటి లక్ష్మి, బీజేపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

కాకుమాను, జనవరి 12: గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ కామేపల్లి పద్మావతి ఆకాంక్షించారు. మండల పరిధిలోని బోడిపా లెం, కోతివానిపాలెం గ్రామాలలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యా త్ర కార్యక్రమం నిర్వహిచారాఉ. ఈ సందర్భంగా గడచిన ఐదేళ్ల కాలంలో కేం ద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలలో జరిగిన అభివృద్ధిని అధికారులు గ్రా మ సభ ద్వారా స్థానికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రా మకృష్ణ, ఏవో కిరణ్మయి, ఏఈలు ఆనందరావు, రమేష్, వివిధ శాఖల అధికా రులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కాసరనేని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

గ్రామీణ కళలను ప్రోత్సహించాలి

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

● డాక్టర్ కాసరనేని నాటక కళా పరిషత్ నాటిక పోటీలు ప్రారంభం

పెదకాకాని, జనవరి 12 : గ్రామీణ కళలను అందరూ ప్రోత్సహించాలని, నాటి సంస్కృతులను, సాంప్రదాయాలను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు. మూడు రోజులపాటు తక్కెళ్ళపాడులో జరిగే డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళా పరిషత్ 13 జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో గ్రామీణ కళలు అంతరించి పోతున్నాయన్నారు. వాటన్నిటిని భవిష్యత్తు తరాలకు అందించాలంటే వాటిని ప్రోత్సహించాలని తెలిపారు. నాటిక పోటీలలో భాగంగా ప్రక్షాళన, కాపలా.! , మాజీ యువకులు.. అనే మూడు నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎర్ర నాగేశ్వరరావు, ముప్ప అంకమ్మరావు, వట్టి కోటి సుబ్బారావు, పిన్నమనే తిరుపతయ్య, మోపర్తి నాగేశ్వరరావు, మోపర్తి కాళిదాసు, అప్ప సాని నాగమల్లి, నందిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చినా భయపడేది లేదు

● స్పష్టం చేసిన అంగన్‌వాడీ, ఆయాలు

●32వ రోజుకు చేరిన నిరసనలు



సీడీపీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

గుంటూరు(తూర్పు), జనవరి12: రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడమని, సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెలోనే ఉంటామని అంగన్‌వాడీలు, ఆయాలు స్పష్టంచేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు, సిబ్బంది చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు అతికించడం, నేరుగా ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇవ్వడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ధర్నా విర మించుకోవాలని, లేదంటే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని అంగన్‌వాడీలను అధికారులు బెదిరించడంపై భగ్గుమన్నారు. తమకు జారీ చేసిన నోటీసులను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వ హించి అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. అలాగే నల్లపాడులోని సీడీపీవో కార్యాలయానికివెళ్లి అక్కడి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నేతలు దీప్తిమనోజ, రాధాలు మాట్లాడుతూ అంగన్‌వాడీలు విధుల్లోకి వచ్చేలా నచ్చజేప్పేలని కుటుంబసభ్యులకు అధికారులు సూచనలు చేయడం సిగ్గుచేటన్నారు. డిమాండ్లను పరిష్కరించడం మినహా ప్రభుత్వానికి మరోమార్గం లేదని స్పష్టం చేశారు. సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మద్దతు తెలిపారు. రిలే దీక్షలలో పద్మ, అరుణ కుమారి, నాగలక్ష్మీ, శాంతి, రొషిన్, లలితకుమారి, నవరత్నకుమారి, నూర్జహన్ పాల్గొనగా, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

తూర్పులో పసుపు జెండా ఎగరేస్తాం

● టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నసీర్

గుంటూరు, జనవరి12(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజక వర్గంలో పసుపు జెండా ఎగరేస్తామని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. శుక్రవారం అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పరిశీలకుడు గుడపాటి శ్రీనివాస్‌రావు, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా నియోజక వర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండేలా నిరంతరాయంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జగన్‌రెడ్డిని గద్దె దించడానికి టీడీపీ- జనసేన పొత్తు అనివార్యాన్ని గుర్తెరిగి సమన్వయంతో కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం వచ్చిందని, ఇంకా ఎన్ని కలకు 100 రోజులే మిగిలి ఉందని, ప్రతి ఒక్కరూ టీడీపీ-జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నసీర్ కోరారు.

పార్టీ ఆదేశాలమేరకు కలసికట్టుగా పనిచేస్తాం: డేగల ప్రభాకర్

సమావేశంలో నసీర్ వర్గీయులు కొందరు నసీర్‌కు అనుకూలంగా నినాదాలు చేయడంతో డేగల వర్గీయులు కొందరు డేగలకు అనుకూ లంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో డేగల మాట్లాడుతూ పార్టీ ఎవరిని నిలబెట్టినా వారిని గెలిపించడానికి తాను కృషి చేస్తానని, ఇలా దుందుడుకుగా కార్యకర్తలు వ్యవహరించడం సరికాదని సర్దిచెప్పారు. అత్యుత్సాహాన్ని తగ్గించుకోవాలని, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా మెలగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భారతి, సమత, అశోక్, వేములకొండ శ్రీనివాస్, యర్రగొపు నాగేశ్వరావు, శ్రీను నాయక్, జదా, విజయలక్ష్మి, పద్మావతి, సొపాటి రత్నం, జమీర్, మురళి, సురే శ్రీను, వాణి మహంకాళి నరసింహారావు, షేక్ కరిముల్లా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో చైర్మన్ అన్నా నందకిషోర్

సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), జనవరి 12: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌం టెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) ఈనెల 11న ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాలలో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ మార్కు లతో పాటు అత్యధిక పాస్ పర్సెంటేజ్ సాధించారని సంస్థ చైర్మన్ సీఏ అన్నా నందకిషోర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రీమేధ కళాశా లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయనతోపాటు డైరెక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు. ఈ సందర్భంగా సీఏ అన్నా నందకిషోర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థ గత 19 సంవత్సరాల్లో సీఏ, సీఎంఏ కోర్సులలో 400లకు పైగా ఆలిండియా ర్యాంకులు సాధించిందన్నారు. ప్రస్తుత ఫలితాలలో తమ విద్యార్థిని టీ.ఆలివ్ గ్లోరియానా 356 మార్కులు, కే.యోగితారెడ్డి 352, టీ.నందిని దుర్గ 342, ఏ.సాయి వెంకటధీరజ్ 340 మార్కులు సాధించారని అన్న నందకిషోర్ తెలిపారు.

టీడీపీని గెలిపించుకుందాం

పొన్నూరు టౌన్, జనవరి 12: రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని, రానున్న ఎన్నికలో ఎస్టీలందరూ సంఘటితమై టీడీపీని గెలిపించుకుం దామని ఎస్టీసెల్ రాష్ట్ర నాయకుడు తిరుమలశెట్టి శ్రీను పిలుపుని చ్చారు. శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఎస్టీసెల్ నేతలు చింతలపూడిలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్టీల సంక్షేమం జరగాలంటే రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో ఎస్టీలందరూ సంఘటి తమై టీడీపీ గెలుపుకోసం పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిపాడు ఎస్టీసెల్ నాయకులు బాసుల మురళి, కొమరగిరి మహిమ రాజు, రామోహన్, అద్దూరి వెంకటేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు చెల్లంచర్ల వెంకటకృష్ణరావు, తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను అమలు చేయాలి

● కేంద్ర మంతి కిషన్‌రెడ్డికి విద్యార్థి జేఏసీ నేతలు

గుంటూరు,జనవరి 12: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అమలు చే సేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జిలాని ఆధ్వర్యంలో జేఏసీ నేతలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అమరావతి రాజధాని నిర్మాణం, కడప స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నం పోర్టు, కాకినాడ పెట్రోకారిడార్ వంటి విభజన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు అనీల్‌కుమార్, శ్రీకాంత్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు): దేశంలో 52శాతం జనాభా కలిగిన ఓబీసీలకు కేం ద్రంలో ప్రత్యేకమంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని కోరుతూ ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నవజీవన్, పినాకిని రైళ్లను న్యూ గుంటూరు మీదుగా మళ్లించాలి

గుంటూరు సిటీ: నవజీవన్, పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుంటూరు రైల్వేస్టేషన్ మీదగా మళ్లించేందుకు రైల్వేబోర్డుకు ప్రతిపాదనలు పంపించాలని గుంటూరు బీజేపీ నేతలు కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డికి, డీఆర్‌ఎం ఎం.రామకృష్ణలకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం గుంటూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా కొత్తగా నియమితులైన స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రతో కలిసి కేంద్ర మంత్రిని కలసి ఈవిషయంపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రైల్వే అభివృద్ధికమిటీ సభ్యులు సురేష్ కుమార్ జైన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెరకా కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

14న ముగ్గుల పోటీలు

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాతి పండుగ సందర్భంగా ఈనెల 14న గుంటూరు అరండల్ పేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అంగన్వాడీ డ్వాక్రా సాధికారత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి ప్రసన్న రాధిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోటీలు జరుగుతాయని, ఆసక్తిగలవారు పాల్గొనాలని ఆయన తెలియజేశారు.

సంతకం ఫోర్జరీతో సమస్య పరిష్కారం !

● 47వ సచివాలయ ఉద్యోగుల నిర్వాకం ● బాధితుడి ఆవేదన

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 12 : 'మా ఇంట్లోకి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నుండి ఘాటైన వాసనలు వస్తున్నాయి. వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జీఎంసీ అధికారులకు అర్జీ పెట్టాను. కానీ సచివాలయ ఉద్యోగు లు నాసంతకాన్ని ఫోర్జరీ చేసి దరఖాస్తు పరిష్కారం అయినట్లుగా మెసేజ్ పంపించారు' అంటూ నగరంలోని సంగడిగుంట రెడ్ల బజారుకు చెందిన వాక వీరారెడ్డి వాపోయాడు. శుక్రవారం బ్రాడీపేటలోని ఆంధ్రజ్యోతి సిటీ కార్యాలయం వచ్చిన ఆయన 47వ సచివాలయ ఉద్యోగులు చేసిన మోసాన్ని వివరించాడు.. లాంచెస్టర్ మెయిన్ రోడ్డులోని తన నివాసం పక్కనేవున్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నుంచి వస్తున్న ఘాటైన వాసనలు తమను ఇబ్బంది పెడుతున్నాయని ఈ నెల 8న జీఎంసీ స్పందనలో ఫిర్యాదు చేశానన్నాడు. అనంతరం 47వ సచివాలయ ఉద్యోగులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమస్య పరిశీలను వచ్చారు. అయితే తన సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కార మైనట్లు సంతకం పెట్టాలని తనపై అధికారులు ఒత్తిడి తెచ్చారన్నారు. తాను ఒప్పుకోలేదన్నారు. ఇటీవలన తన ఫోన్‌కు 'మీ సమస్య పరిష్కారం అయింది' అన్నట్లు తన ఫోర్జరీ సంతకంతో మెసేజ్ వచ్చిందన్నారు. తన సంతకాన్ని సచివాలయ ఉద్యోగులు ఫోర్జరీ చేసి మోసగించారని వీరారెడ్డి వాపోయాడు.

జీఎంసీ ఆస్తుల అద్దెల వసూళ్లకు గజిట్

● అదనపు కమిషనర్ కే.లక్ష్మీ శివజ్యోతి.

గుంటూరు(కార్పొరేషన్),జనవరి12: నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్లు, దుకానాలు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్లకు రుసుం వసూళ్లు చేసుకునే విధి విధానాల గూర్చి త్వరలో గెజిట్ తయారు చేయనున్నట్లు అదనపు కమిషనర్ కే.లక్ష్మీ శివజ్యోతి తెలి పారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వివిధ మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, ఆర్.ఓ.లు, ఆర్.ఐ.లతో నగరంలో ఇప్పటివరకి ఉన్న గెజిట్ పైన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత పాత గెజిట్ వివ రాలు, నగరంలో ఉన్న మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, మరుగుదొడ్ల వివరాలను డిప్యూటీ కమిషనర్ తెలియచేశారు. సదరు అంశాలపైన మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, ప్రజల అభిప్రాయాలు తీసుకున్న అనం తరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. సబంధిత వాటికి పబ్లిక్ ఆక్షన్ ద్వారా గుత్తేదారులకు కేటాయించి రుసుం వసూళ్లు చేయడం జరుగుతుంద న్నారు. ప్రస్తుత సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని స్టాండింగ్ కౌన్సిల్లో ఆమోదిస్తామని తెలిపారు. ప్రస్తుత కాలంలో నగరపాలక సంస్థకు బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలని, లేకుంటే గత గెజిట్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఆర్వోలు రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద విగ్రహం వద్ద తెలుగు యువత నేతల నిరసన

జగన్‌రెడ్డి వలలో పడితే

'అడుక్కుతిందాం ఆంధ్రా'నే ..

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతను వంచించిన జగన్ వలలో పడితే చివరకు 'అడుక్కుతిందాం ఆంధ్రా' అవడం ఖాయమని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలుగు యువత వినూత్న ప్రదర్శన నిర్వహించారు. పట్టాభిపురం మెయిన్ రోడ్డులోని వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించి, జాబ్ క్యాలెండర్‌పై జగన్ వంచనను నిరసిస్తూ గాలి బుడగలు గాల్లోకి వదిలి, జగన్ హామీలన్నీ గాలి బుడగలే అంటూ నినాదాలుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ యువతను పారిశ్రామిక వేత్తలను చేస్తానన్న ముఖ్యమంత్రి ఫిష్ ఆంధ్ర పెడితే అది ఫినిష్ ఆంధ్ర అయిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో జనసేన నేత ఆళ్ల హరి, తెలుగు యువత నేతలు ఫిరోజ్, విజయ్‌కిరణ్, నాగుల్‌మీరా, రాము, కిరణ్, శేఖర్, షకూర్, అథావుల్లా తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీ విద్యార్థుల 'దర్గా టు దుర్గ' నడక

పెదకాకాని, జనవరి 12: స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు 13వ జాతిసమైక్యత నడక 'దర్గా టు దుర్గ'ను శుక్రవారం నిర్వహించారు. నగరం లోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా వద్ద వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యా సాగర్, గుంటూరు శారదామఠం ధర్మాత్మ ప్రాణమాతాజీ ఈ సమైక్యతా నడ కను ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి జైన్ టెంపుల్, డోలాస్‌నగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కి.మీ. మేర సాగిన ఈనడకలో కళాశాలకు చెందిన రెండు వేలమంది విద్యా ర్థినీ, విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విభాగాల క్యాడెట్స్ పాల్గొన్నారు. కళా శాలకు చెందిన అధ్యాపకేతర సభ్యుడు నంబూరి మణికుమార్ సుభాష్ చంద్రబోస్ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మార్గమధ్యలోని దేవా లయాలు, చర్చిలలో విద్యార్థులు ప్రత్యేక పూజ, ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొ న్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, శారదామఠం ధర్మాత్మ ప్రాణమాతాజీ, వైస్ ప్రిన్సిపాల్ వాసిరెడ్డి మహదేవ్, జాయింట్ సెక్ర టరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి

● బస్టాండ్‌లో ఆర్టీసీ ఎన్ఎమ్‌యూ ఉద్యోగుల నిరసన

గుంటూరు,జనవరి12: ఆర్టీసీ ఉద్యోగులపై అధికారుల వేధింపులు మాను కోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఈశ్వర్, లక్ష్మయ్యలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ చేసే విధానం మానుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు-1 డిపోలో డ్రైవర్ల చార్ట్‌బుకింగ్ టిఐ-2 చాలా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, పీఎస్‌రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 'పల్లె'వించిన సంక్రాంతి

గుంటూరు(విద్య),జనవరి 12: రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాట లతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరా న్నంటాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావురత్తయ్య విద్యార్థు లతో మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగని, మన పండుగల్లోని విశిష్టతను, శాస్త్రీయతను విద్యార్థులు గుర్తించాలన్నారు. సంక్రాంతి పర్వ దినాల్లో పల్లెటూళ్లు ఎంతో అందంగా, ఆహ్లాదంగా ఉంటాయని, జానపద వినోద కళాకారులు, పగటి వేషధారులు ఈ పండుగ సమయంలో పల్లెల్లో వినోదాన్ని పంచుతారన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారులపై భోగిపండ్లు పోసి దీవిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

ఆర్వీఆర్‌జేసీలో వివేకానంద జయంతి

గుంటూరు(విద్య),జనవరి 12:దేశప్రగతి నిర్మాణంలో యువశక్తి కీలకమనే భావనతో, యువ తను జాగృతి చేయడంలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీ రింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చౌడవరంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రహ్మణ ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో...

బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవాసమితి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వ ర్యంలో స్థానిక మల్లారెడ్డి నగర్‌లోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహిం చిన సమితి అధ్యక్షుడు పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి శివన్నా రాయణ, సమితి సభ్యులు, పాఠశాల డైరెక్టర్ రామచంద్రరావు, మేనేజర్ ఎస్‌కే.వలి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, జనవరి 12: విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా రెండో శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు గుంటూరు టౌన్-1 ఈఈ టీ. శ్రీనివాసబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ అంతరా యాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

వేసవిలో ప్రేక్షకుల ముందుకు



పురాణ, ఇతిహాసాలను ఆధారం చేసుకొని, దానికి సైన్స్ ఫిక్షన్‌ని జత చేసి, భవిష్యత్తును అద్భుతంగా ఊహిస్తూ... దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా ఫాంటసీ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమాను మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాత సి.అశ్వనీదత్ ప్రకటించారు. కాశీ, ముంబై, ఢిల్లీ, చండీగఢ్, చెన్నై, మధురై, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, భీమవరం, విజయవాడ, కశ్మీర్‌తో సహా దేశంలోని పలు నగరాల్లో రైడర్‌ల ద్వారా ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ విభిన్నంగా ప్రకటించారు. 'వైజయంతీ మూవీస్ 50ఏళ్ల ప్రయాణంలో మే 9వ తేదీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. మా సంస్థ నుంచి వచ్చిన జగదేకవీరుడు-అతిలోకసుందరి, మహానటి, మహర్షి చిత్రాలు అదే తేదీలో విడుదలై అఖండ విజయాలను చవిచూశాయి. అమితాబ్, కమల్, ప్రభాస్, దీపిక పదుకొనే వంటి ప్రతిభావంతులైన ఆర్టిస్టులు కలిసి నటిస్తున్న ఈ చిత్రం వైజయంతీ మూవీస్ చరిత్రలోనే మైలురాయిలా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలం' అని నిర్మాత అశ్వినీదత్ పేర్కొన్నారు. హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: సంతోశ్ నారాయణ్,



రిపబ్లిక్ డేకు మిల్లర్ రాక

ధనుష్ కథానాయకుడిగా రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం తెలుగు వెర్షన్ మినహా మిగిలిన భాషల్లో శుక్రవారం రిలీజ్ చేశారు. తెలుగులో మాత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు హక్కులు కొనుగోలు చేసిన ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం తెలిపాయి. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, శివ రాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

చెప్పినదానికంటే గొప్పగా తీశాడు

'సైంధవ్' రెగ్యులర్ కథ కాదు. డిఫరెంట్ జానర్. కథ డిమాండ్ మేరకే ఎమోషనల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయి. అవి కూడా నేచురల్‌గా ఉంటాయి. నా వరకూ ఈ సినిమా విషయంలో ప్రత్యేకంగా నచ్చిన అంశం ఏంటంటే.. కూతురు సెంటిమెంట్. చాలారోజుల తర్వాత ఎమోషన్స్ పలికించే అవకాశం వచ్చింది. నటుడిగా నాకిది కొత్త జానర్' అన్నారు అగ్రనటుడు వెంకటేశ్. ఆయన హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన చిత్రం 'సైంధవ్'. నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకటేశ్ విలేకరులతో మాట్లాడారు.

చాలామంది హీరోలు కెరీర్ పరంగా యాభై, డెభ్బై ఐదు, వంద.. ఇలాంటి నంబర్లను మైలురాళ్లగా భావిస్తుంటారు. దాంతో ఒత్తిడి సహజం. నాకైతే అలాంటి ఒత్తిడి ఏమీ లేదు. 75 అనేది నా వరకూ నంబర్ మాత్రమే. ప్రతి సినిమాకూ నిజాయితీగా నిబద్ధతతో పనిచేయాలనేది నా సిద్ధాంతం. 75వ సినిమాతో అయిపోలేదు.. ఇంకా చాలా ప్రయాణం మిగిలుంది.

- దర్శకుడు శైలేశ్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. అద్భుతమైన కథతో నా దగ్గరకొచ్చాడు తను. చెప్పినదానికంటే గొప్పగా తీశాడు. లొకేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ మాదిరిగా అందరితో కలిసిపోయి పనిచేశాడు. ముఖ్యంగా క్లైమాక్స్‌ని ఎక్స్‌ట్రార్డినరీగా డిజైన్ చేశాడు. కథ నడిచే తీరు కూడా కొత్తగా ఉంటుంది. ఇదంతా శైలేష్ గొప్పతనమే.
- ఇది చైల్డ్ సెంటిమెంట్ మూవీ. ఇందులో నా కూతురుగా బేబీ సారా నటించింది. ఆ అమ్మాయిలో గొప్ప స్పార్క్ ఉంది. అద్భుతంగా నటించింది. మా ఇద్దరిపై తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేస్తాయి. ఓ విధంగా ఈ కథ తనదే.
- దేశం గర్వించదగ్గ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ.. అతనితో కలిసి పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 'గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్' నుంచి ఆయన ప్రయాణం విలక్షణంగా సాగుతోంది. ఇందులో ఆయనది చాలా క్రేజీ రోల్. సాధారణ సందర్భాల్లో కూడా విభిన్నంగా నటించే నటుడు నవాజుద్దీన్. ఇందులో ఆయన మార్క్ నటనను చూస్తారు.
- నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. కథ డిమాండ్ మేరకు 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షన్ సిటీని నిర్మించారాయన. డ్రగ్స్, గన్స్ ఇలాంటి హాలీవుడ్ తరహా కల్చర్ తెరపై కనిపిస్తుంది. ఇదంతా దర్శకుడి సృజన. 'సైంధవ్' సినేరియా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తర్వాత ఇలాంటి కథలు ఇంకొన్ని వస్తాయి. ఇక నా విషయానికొస్తే కథలు వింటున్నాను. చేయబోతున్న సినిమాల గురించి త్వరలో చెబుతా.

వెంకటేశ్





డేట్ కుదిరింది



రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. శుక్రవారం ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి 23న 'తిరగబడరా సామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 'యువతను ఆకట్టుకునే రొమాన్స్, కుటుంబ ప్రేక్షకులను ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ను అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. మనారా చోప్రా ప్రత్యేకగీతంలో నర్తించారు' అని యూనిట్ తెలిపింది. మకరంద్‌దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత ఠాకూర్, రాజా రవీంద్ర కీలకపాత్రలు పోషించారు. సంగీతం:జేబీ. సినిమాటోగ్రఫీ: జవహర్ రెడ్డి ఎం.ఎన్

తంత్ర గీతం వచ్చింది




అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి, సలోని ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి., రవిచైతన్య నిర్మించారు. ఈ చిత్రం నుంచి అనురాగ్ కులకర్ణి ఆలపించిన 'ధీరే ధీరే' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, నటి అనసూయ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'అనురాగ్ కులకర్ణి అద్భుతంగా ఆలపించిన గీతమిది. త్వరలో ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఫస్ట్ లుక్, టీజర్‌కు వస్తున్న ఆదరణ మాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. వినూత్నమైన అంశాలతో ప్రేక్షకులకు వినోదం పంచే చిత్రమిది' అన్నారు.



సోదర ద్వయం దర్శకత్వంలో

వరుస వైఫల్యాలను అధిగమించి 'విక్రమ్' చిత్రంతో తిరిగి హిట్ బాట పట్టారు కమల్‌హాసన్. ఆ సక్సెస్ ఇచ్చిన ఉత్సాహంతో వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఆయన మణిరత్నం దర్శకత్వంలో 'థగ్ లైఫ్' చిత్రం చేస్తున్నారు. షూటింగ్ జరుగుతోంది. దీంతో పాటు ఆయన కథానాయకుడిగా ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. 'కేహెచ్ 237' అనేది వర్కింగ్ టైటిల్. ఆర్ మహేంద్రన్‌తో కలసి కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ స్పెషల్ అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు అన్బు, అరివు సోదర ద్వయం 'కేహెచ్ 237'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని కమల్‌హాసన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అన్బు అరివ్‌తో దిగిన ఫొటోను కమల్‌హాసన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.





టీడీపీని సంఘటితంగా గెలిపించుకుందాం

● ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీను
● ధూళిపాళ్లను కలిసి తమ సమస్యలపై వినతి



నరేంద్ర కుమార్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న ప్రత్తిపాడు ఎస్టీ నాయకులు

పొన్నూరు టౌన్, జనవరి 12: రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని, రానున్న ఎన్నికలో ఎస్టీలందరూ సంఘటితమై టీడీపీని గెలిపించుకుందామని ఎస్టీసెల్ రాష్ట్ర నాయకుడు తిరుమలశెట్టి శ్రీను పిలుపునిచ్చారు. శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఎస్టీసెల్ నాయకులు చింతలపూడిలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పలువురు ఎస్టీ సెల్ నాయకులు మాట్లాడుతూ యానాదుల సంక్షేమం కోసం టీడీపీ ప్రవేశపెట్టిన 17ఎస్టీ సంక్షేమ పథకాలకు వైసీపీ ప్రభుత్వం ఉప్పుపాతర వేసిందని ఆరోపించారు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వటంతోపాటు, ప్రతి ఒక్కరికి 3లక్షల రుణాలు ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవులు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అయన హామీలను నమ్మి గత ఎన్నికలో వైసీపీ విజయానికి దోహదపడినట్లు తెలిపారు. గద్దెనెక్కిన మరుసటిరోజు నుంచి యానాదులను పట్టించుకోవటం మానేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు చెపుకుందామంటే అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవటమే కాకుండా ఆయన గేట్‌ను కూడా తాకనివ్వటంలేదని ఆరోపించారు. ఎస్టీల సంక్షేమం జరగాలంటే రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో ఎస్టీలందరూ సంఘటితమై టీడీపీ గెలుపు కోసం పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిపాడు ఎస్టీసెల్ నాయకులు బాసుల మురళి, కొమరగిరి మహిమరాజు, రామోహన్, అద్దూరి వెంకటేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు చెల్లంచర్ల వెంకటకృష్ణరావు, పోట్లూరి సుగుణ, జున్ను కళ్యాణి, బాపట్ల, వట్టిచెరుకూరు తదితర మండలాలకు చెందిన ఎస్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిషేధం: తహసీల్దార్ రవిబాబు

తెనాలి రూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు వేయడం నిషేధమని అట్టివారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ రవిబాబు హెచ్చరించారు. సంక్రాంతి పండుగను కుటుంబసమేతంగా సంతోషంగా గడపాలని పండుగ పేరుతో కోడిపందాలు నిర్వహించి బెట్టింగులకు పాల్పడవద్దన్నారు. గ్రామాల్లో కోడిపందాలపై గట్టినిఘా ఉందని ఎవరైనా పందాలు నిర్వహిస్తే చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని చెప్పారు. గ్రామ పంచాయతీల్లోని వీఆర్వోలు, సెక్రటరీలు, గ్రామ మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల్లో పర్యవేక్షించాలన్నారు. పందాలు జరిగే సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చి జీవహింస జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలి రూరల్, జనవరి 12: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌కుమార్ తెలిపారు. తెనాలి పట్టణ, రూరల్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● పొన్నూరు టౌన్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పట్టణ, మండలంలో విద్యుత్ కోత అమలులో ఉండనున్నట్లు ఏడీఈ ఎం.శ్రీనివాసరావు మండల ఏఈ కె.వెంకయ్య, పట్టణ ఏఈ కె.వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు.



జనసేనలో చేరిన కార్యకర్తలతో మనోహర్

జనసేనలోకి వైసీపీ కార్యకర్తలు

తెనాలి క్రైం, జనవరి 12: జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరుతున్నారని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని 23వ వార్డులో జరిగిన పార్టీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు కట్టుబడి ప్రతి కార్యకర్త నడుచుకోవాలని కోరారు. రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనేది పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ధ్యేయమన్నారు. పార్టీలో చేరిన వారిలో సీహెచ్ చిరంజీవి, సుబ్రమణ్యం, రోజా రాణి, శివ, రోశయ్య, గోపిచరణ్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితర నాయకులున్నారు.

ఏపీలో చిత్రపరిశ్రమ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

● సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, జనవరి 12 : ఏపీలో చిత్రపరిశ్రమ అభివృద్ధికి దర్శక, నిర్మాతలు ప్రణాళిక రూపొందించాలని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. పెదరావూరు స్టూడియోలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రానికి చెందిన నిర్మాతలు రాష్ట్రంలోని లోకేషన్లలో కనీసం 20శాతం చిత్రం నిర్మిస్తే రాష్ట్రాభివృద్ధికి తగిన నిధులు లభిస్తాయన్నారు. విశాఖ, అరకు, కోనసీమ, భవానీ ద్వీపం, కొండవీడు, సూర్యలంక, నిజాంపట్నం హార్బర్ వంటి ఎన్నో మంచి లోకేషన్లు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. సబ్సిడీ కూడా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం

ప్రజా యాత్రలో మాజీ మంత్రి ఆలపాటి



పాదయాత్రలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జనవరి 12: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించుకుని రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందామని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రజాయాత్ర శుక్రవారం గుడివాడ నుంచి కొలకలూరు వరకూ సాగింది. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజలకు అందించే సంక్షేమం, రాష్ట్రంలో జరిగే అభివృద్ధిపై చైతన్యం నింపుతూ హుషారుగా సాగుతోంది. ఆలపాటి ప్రజాయాత్రకు ఆయా గ్రామాల నుండి ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలుపుతూ గ్రామ శివారువరకూ ఆయనతో అడుగు కలుపుతూ నడుస్తున్నారు. పాదయాత్ర జరిగే గ్రామాల దారిపొడవునా మహిళలు ఆలపాటికి హారతులు ఇస్తూ దిష్టితీస్తూ స్వాగతం పలుకుతున్నారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు తాను ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తానని మాట ఇచ్చారని చెప్పారు. అయితే ఆయన అధికారంలోకి వచ్చి దాదాపుగా నాలుగుసంవత్సరాల 8 నెలలు కావస్తుందని ఇప్పటికీ ఆ హామీలను సంపూర్ణంగా నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. జగన్‌పాలన రాష్ట్రాన్ని 10సంవత్సరాలు వెనక్కినెట్టిందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అమరావతి రాజధాని అని చెప్పి అధికారంలోకి రాగానే మూడు రాజధానులు తెస్తాననటం దారుణం అన్నారు. రాజధాని ప్రాంతంలో గత ప్రభుత్వం వేసిన రోడ్లు కూడా తవ్వేస్తున్నా పట్టించుకోకపోవటం దారుణం అని విమర్శించారు. పాదయాత్ర సాయంత్రానికి గుడివాడ, కొలకలూరులో పర్యటించి ఖాజీపేటకు చేరింది. దాదాపుగా 12.4 కిలోమీటర్ల మేర పాదయాత్ర జరిగింది. ఐదురోజుల్లో ఆలపాటి 53.5కిలోమీటర్లు పూర్తయింది. పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, గుడివాడ గ్రామసర్పంచ్ యడ్లపాటి రాకేష్, ఈదర వెంకటపూర్ణచంద్, తోట లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, హెచ్‌సీవీ ఎండీ, టీడీపీ సీనియర్ నాయకులు కరణం వెంకటేశ్వరరావు, సుంకర హరికృష్ణ, పెద్దసంఖ్యలో టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

కలశాలతో అంగన్‌వాడీల నిరసన ప్రదర్శన



కలశాలతో ప్రభుత్వానికి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తెనాలి అర్బన్, జనవరి 12 : 32 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వానికి జ్ఞానోదయం కలగడం లేదని అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ జిల్లా నాయకురాలు ఏవీఎస్ కుమారి విమర్శించారు. విజయవాడ రోడ్డులోని వినాయక విగ్రహం వద్ద సమ్మె శిబిరం నుంచి సాయిబాబా ఆలయం వరకు కలశాలతో శుక్రవారం ప్రదర్శన చేశారు. దేవుడైనా ప్రభుత్వ నేతలకు కనువిప్పు కలిగించాలని ప్రార్థించారు. అంగన్‌వాడీలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, కనీస వేతనం కోరుతుంటే స్పందించకపోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా సమ్మె ప్రాధాన్యాన్ని గుర్తించి డిమాండ్లు నెరవేర్చాలని, పేద పిల్లలు, బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం అందించే జాప్యం లేకుండా చేయాలని కోరారు. మాజీ కౌన్సిలర్ కోగంటి రామారావు, రాధాకృష్ణమూర్తి, ఉద్యమ నిధికి రూ.5 వేలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు కళాధర్, సాంబశివరావు సంఘ నాయకులు పావని, రంగపుష్ప, వీరమణి, కమలమ్మ, జానకి పాల్గొన్నారు.

● కొల్లిపర: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 32వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు సంతకాలు సేకరణ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు 32రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ మండల స్థాయి నాయకులు నిర్మలజ్యోతి, సీతమ్మ, డి.శివపార్వతి, ఆదిలక్ష్మి, సంతోషకుమారి, దీప్తి, శ్రీలక్ష్మి, సువర్ణలత, మాధవిలత తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో సంతకాలు సేకరిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వం బెదిరింపులు మానుకోవాలి: నేతాజీ

పొన్నూరు టౌన్: అంగన్‌వాడీలపై ప్రభుత్వం బెదిరింపులు మానుకోవాలన్ని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వై.నేతాజీ హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ మహిళలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అంతరం నిరసన దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు వై నేతాజీ సంఘీభావం తెలిపారు. నేతాజీ మాట్లాడుతూ నోటీసుల పేరుతో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కుటుంబ సభ్యులను బెదరిస్తున్నారని ఆరోపించారు. బెదిరింపులు మానుకోకపోతే సూపర్‌వైజర్ల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



పొన్నూరులో స్వామి వివేకానంద విగ్రహానికి పట్టణ వాసుల నివాళి

తెనాలి అర్బన్, జనవరి 12: నిరంతర శ్రమ చేస్తే ఉన్నత విజయ శిఖరాలు చేరుకుంటారని రోటరీ క్లబ్ ప్రతినిధి కె.రామరాజు చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్‌లో వివేకానందుని జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానందుని సూచించిన మార్గాన్ని విద్యార్థులు అనుసరించాలని ఆయన చెప్పారు. శాస్త్రీయ, సాంకేతిక రంగాల్లో రాణించాలని కోరారు. గుత్తా వెంకటరత్నం, డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, ప్రిన్సిపల్ బ్రహ్మం, సీఈవోలు వెంకట్‌రామ్, ఉదయ్‌కిరణ్, ఏవో సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగిలో స్వామి వివేకానంద జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి గ్రామపెద్దలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వివేకానంద విద్యామందిర్ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు మాట్లాడుతూ భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిద్దిటానికి స్వామి వివేకానంద ప్రపంచం మొత్తం పర్యటించారన్నారు. కార్యక్రమంలో చైతన్య వేదిక ప్రతినిధులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వంగా జనార్ధనరెడ్డి, డాక్టర్ రంగారావు, గ్రామ పెద్దలు వరదారెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: దేశభక్తి చాటుకోవటంలో నేటి యువతకు స్వామి వివేకానంద మార్గదర్శకుడు అన్ని ఇస్కాన్ చీరాల శాఖ నిర్వాహకులు కీర్తి రాజు ప్రభుస్వామిజీ అన్నారు. పట్టణంలోని రైలు పేటలో శుక్రవారం స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన 161వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత స్వామిజీ స్వామి వివేకానంద జీవిత విశేషాలను తెలియజెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు దండు శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుడు గోవాడ వెంకట కృష్ణారావు, వడ్రాణం ఉదయ్ చంద్రరావు, నక్క కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

పొన్నూరు టౌన్, జనవరి 12: స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో రక్తదాన శిబిరం జరిగింది. పొన్నూరు బ్లెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేయగా వారికి ధృవీకరణ పత్రాలు అందచేసారు. కార్యక్రమంలో బ్లెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుమలశెట్టి ఉమాశంకర్, మల్లెబోయిన నాగరాజు, కాట్రగడ్డ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామరాజు, వీరనారాయణ



పొన్నూరులో రక్తదానం చేస్తున్న దాతలు



కొల్లిపర మండలం మున్నంగిలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్థులు



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శారద మఠం మాతాజీ, విద్యాసాగర్ తదితరులు

వీవీఐటీ విద్యార్థుల 'దర్గా టు దుర్గ' నడక

పెదకాకాని, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు 13వ జాతి సమైక్యత నడక 'దర్గా టు దుర్గ'ను శుక్రవారం నిర్వహించారు. గుంటూరు నగరంలోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా వద్ద వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, గుంటూరు శారదామఠం ధర్మాత్మ ప్రాణమాతాజీ ఈ సమైక్యతా నడకను ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి జైన్ టెంపుల్, జోలాస్‌నగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కి.మీ. మేర సాగిన ఈనడకలో కళాశాలకు చెందిన రెండు వేలమంది విద్యార్థినీ, విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విభాగాల క్యాడెట్స్ పాల్గొన్నారు. కళాశాలకు చెందిన అధ్యాపకేతర సభ్యుడు నంబూరి మణికుమార్ సుభాష్ చంద్రబోస్ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మార్గమధ్యలోని దేవాలయాలు, చర్చిలలో విద్యార్థులు ప్రత్యేక పూజ, ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు. కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ, గత 13 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. విద్యార్థులలో ఐక్యమత్యం పెంపొందించి సమైక్యత చాటేందుకు ఈనడక దోహదపడుతుందని అన్నారు. శారదామఠం ధర్మాత్మ ప్రాణమాతాజీ మాట్లాడుతూ భారతదేశం యువత స్వామి వివేకానంద జీవిత విశేషాలు తెలుసుకోవాలని అన్నారు. లక్ష్యం చేరేవరకూ విశ్రమించకుండా పోరాడలన్న స్వామి వివేకానంద మాటలను ఆచరణలో చూపాలని కోరారు. కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ వాసిరెడ్డి మహదేవ్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్‌ఆఫ్ ఆకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుడికి నరేంద్ర నివాళి



మృతుడికి నివాళి అర్పిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జనవరి 12: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన నామా డేనియల్ రాజ్‌కుమార్ శుక్రవారం మృతి చెందారు. డేనియల్ రాజ్‌కుమార్ మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రాజ్‌కుమార్ గృహానికి చేరుకొన్ని మృతదేహాని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్‌కుమార్ సోదరుడు నామా డేవిడ్‌ను పరామర్శించారు. మృతుడి కుటుంబాని పరామర్శించారు.

పేదలకు అంజుమన్ కమిటీ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందచేస్తున్న అంజుమన్ కమిటీ నిర్వాహకులు

పొన్నూరు టౌన్, జనవరి 12: పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ముస్లిం పేద పిల్లలకు శుక్రవారం అంజుమన్ కమిటీ నిర్వాహకులు ఆర్థికసాయాన్ని అందచేశారు. పేద పిల్లల వివాహాలకు అనారోగ్యానికి గురైన పేదల కుటుంబాలకు ఈ ఆర్థికసాయాన్ని అర్బన్ ఎస్ఐ షేక్ హఫీన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మహ్మద్, షేక్ కరిముల్లా, షేక్ మస్తాన్, షేక్ నగూర్ బాషా, షేక్ హుస్సేన్, షేక్ మొహిదీన్, పఠాన్ జమాల్, షేక్ షౌకత్, హాజీ నజీర్, రహంతుల్లా, నయూం జానీ, అమీన్ సుభాని, మున్నీర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట జనవరి 12: పట్టణంలో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో శుక్రవారం చదలవాడ శ్రీనివాసరావు, యమున దంపతుల కుమార్తె మనస్విని 11వ జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. శివాజీచౌక్‌లో మాజీమంత్రి ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ కళలను అందరూ ప్రోత్సహించాలి

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి



కాసరనేని సదాశివరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకాకాని, జనవరి 12: గ్రామీణ కళలను అందరూ ప్రోత్సహించాలని, నాటి సంస్కృతులను, సంప్రదాయాలను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు. మూడు రోజులపాటు తక్కెళ్ళపాడులో జరిగే డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళా పరిషత్ 13 జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో గ్రామీణ కళలు అంతరించి పోతున్నాయని అన్నారు. వాటన్నిటిని భవిష్యత్తు తరాలకు అందించాలంటే వాటిని ప్రోత్సహించాలన్నారు. నాటిక పోటీలలో భాగంగా ప్రక్షాళన, కాపలా, మాజీ యువకులు అనే మూడు నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎర్రా నాగేశ్వరరావు, ముప్ప అంకమ్మరావు, వట్టి కోటి సుబ్బారావు, పిన్నమనేని తిరుపతయ్య, మోపర్తి నాగేశ్వరరావు, మోపర్తి కాళిదాసు, అప్పసాని నాగమల్లి, నందిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన హనుమధీశ్వర మహాయజ్ఞం



ప్రవచనం చేస్తున్న శ్రీనివాస్ స్వామి

తెనాలి అర్బన్, జనవరి 12: బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో వారం రోజులపాటు నిర్వహించిన చండీసహిత హనుమధీశ్వర మహాయజ్ఞం శుక్రవారం ముగిసింది. ఈ నెల 6 నుంచి మొదలైన యజ్ఞ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని తరించారు. ప్రతిరోజు ఉదయం యజ్ఞ కార్యక్రమాలు, సాయంత్రం రామాయణ ప్రవచనం నిర్వహించారు. ఆదివారం జరిగిన సహస్రగళ సంపూర్ణ భగవద్గీత పారాయణలో భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎంఎస్ రామారావు ట్రస్ట్ ఛైర్మన్ శ్రీనివాస్ స్వామిజీ ప్రతిరోజు సుందరకాండ పారాయణ, రామాయణ ప్రవచనం చేశారు. ముగింపు రోజున భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు వారం రోజులపాటు జరిగిన యజ్ఞం, ప్రవచన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నూకల వేణుగోపాలరావు, కార్యదర్శి బూరెల నరసింహారావు, కమిటీ సభ్యులు యజ్ఞ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



చీరలను పంపిణీ చేస్తున్న రాజకుమారి, సుధాకర్‌బాబు, దుర్గా శ్రీనివాసరావు తదితరులు

పేద మహిళలకు చీరల పంపిణీ

తెనాలి, మారీసుపేట జనవరి 12: మండల పరిదిలోని అంగలకుదురులో శుక్రవారం రావూరి సావబశివరావు 7వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అయన కుమారులు రావూరి సుధాకరబాబు, దుర్గా శ్రీనివాసరావు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళ కమీషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పాలొ పేద మహిళలకు చీరలను, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి వెంకట్రామయ్య, గడ్డిపాటి నాగయ్య, ఉన్నవ అప్పయ్య కొరివి శివ, డాక్టర్ ఐనాల మల్లేశ్వరావు, రాంబాబు, ప్రతాప్, సూరిబాబులు పాల్గొన్నారు.

వీఎస్ఆర్‌లో సంక్రాంతి సంబరాలు



తెనాలి, మారీసుపేట జనవరి 12: పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి పండగను సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల కరస్పాడెంటు నన్నపనేని సుధాకర్, ఐడీపీసీ కోఆర్డినేటర్ ఎస్ సుగుణ పాల్గొన్నారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాద్ పర్యవేక్షణలో జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

తెనాలి, మారీసుపేట జనవరి 12: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయ పడిందని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం పోలీసు తెలిపిన వివరముల ప్రకారం పట్టణంలోని సుల్తానాబాద్‌కు చెందిన మండే సంతోషం (60) గురువారం తన బంధువుల ఇంటికి సుందరయ్యనగర్ వెళ్లి తిరిగి తన ఇంటికి రావడానికి ఆటో ఎక్కగా, ఆగి ఉన్న ఆటోను లారీ రివర్స్ చేస్తూ ఢీకొనడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

15 నుంచి టీపీఎల్ క్రికెట్ పోటీలు

తెనాలి, మారీసుపేట జనవరి 12: స్థానిక గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పటల్స్‌లో శుక్రవారం తెనాలి ప్రీమియం లీగ్ క్రికెట్ వన్‌డే పోటీల లోగోను హాస్పటల్స్ ఎండీ డాక్టర్ పావని ప్రియాంక ఆవిష్కరించి, నిర్వాహకులు మాలిక్, వినోద్, నాగిశెట్టి సాయి తరుణ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ మాలిక్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి టీపీఎల్ క్రికెట్ వన్‌డే పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

వైకుంఠపురంలో రేపు భోగిపండ్ల వేడుక

తెనాలి అర్బన్, జనవరి 12: వైకుంఠపురం ఆలయంలో ఆదివారం భోగిపండ్లు పురస్కరించుకుని భోగి పండ్ల వేడుక జరుగుతుందని ఈవో తిమ్మానాయుడు చెప్పారు. ఆలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, తల్లిదండ్రులు 11ఏళ్ల లోపు బాల బాలికలను వేడుకకు తీసుకు రావాలని కోరారు.

పాస్టర్లకు దుప్పట్లు పంపిణీ

తెనాలి అర్బన్, జనవరి 12: రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాస్టర్లకు దుప్పట్లు, రూ.500 నగదు పంపిణీ చేశారు. టౌన్ చర్చిలో పాస్టర్‌గా పనిచేసిన దేవరపల్లి రత్నం వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం మిషన్ కాంపౌండ్‌లో సేవ కార్యక్రమం నిర్వహించారు. టైటస్, వినయ్‌ప్రకాష్, సుందర్, తదితరులు పాల్గొన్నారు.